సాక్షి విశాఖపట్నం

బుధవారం : 18 : జూన్ : 2025



అడ్మిషన్లలో వెనుక'బడి' 8లో



ఘనంగా గంగమ్మ మారువారం పండగ 8లో



ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్ 8లో

బీచ్‌రోడ్డు దిగ్బంధం



యోగా వేడుకల ఏర్పాట్లు

వాహనాల రాకపోకల నిలిపివేత ■ పోలీసుల వలయంలో సాగరతీరం ■ శరవేగంగా యోగా దినోత్సవ ఏర్పాట్లు



ఏర్పాట్లలో నిమగ్నమైన పోలీసులు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి బీచ్‌రోడ్డులో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. యోగా కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తుండటంతో పనులకు ఆటంకం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్.కె.బీచ్ నుంచి వాల్తేర్ డిపో కూడలి వరకు రహదారిని **మూసివేయడంతో.. అటువైపుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యా**మ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఇక యోగా దినోత్సవం కోసం బీచ్ రోడ్డులో పనులు ఊపందుకున్నాయి. రహదారికి ఇరువైపులా ప్రత్యేక కంపార్ట్‌మెంట్ల నిర్మాణం, వాటిలో గ్రీన్ మ్యాట్‌లు పరచడం వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీక్షకుల సౌకర్యార్థం ఎల్‌ఈడీ తెరలను, వాటికి అవసరమైన ఇంటర్నెట్, విద్యుత్ కనెక్షన్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆర్.కె.బీచ్ వద్ద ప్రధాన వేదికతో పాటు, ఇసుక తిన్నెలపై మరో భారీ వేదికను నిర్మిస్తున్నారు. భారీగా హాజరయ్యే ప్రజల కోసం మొబైల్ టాయిలెట్లను కూడా అందుబాటులోకి తెచ్చారు. మరోవైపు ఫుట్‌పాత్‌లకు, డివైడర్లకు రంగులు వేస్తూ తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. యోగాంధ్ర ప్రచారంలో భాగంగా నగరంలో హోర్డింగులు, బ్యానర్లు వెలిశాయి. ఈ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నగర పోలీసులతో పాటు ఇతర జిల్లాల నుంచి అదనపు బలగాలు విశాఖకు చేరుకున్నాయి. కేంద్ర భద్రతా దళం(ఎస్‌పీజీ) అధికారులు సైతం ఏర్పాట్లను నిశితంగా పరిశీలిస్తూ, భద్రతాపరమైన సూచనలు అందిస్తున్నారు. తీరం వెంబడి పూర్తిస్థాయిలో పోలీసులను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.



మొబైల్ మరుగుదొడ్లను సిద్ధం చేస్తున్న కార్మికులు

యోగాంధ్రకు నిధుల కటకట

- గంటల వ్యవధిలోనే ఆవిరైన రూ.20 కోట్లు
- నిర్వహణకు మొత్తం రూ.75 కోట్లు అవసరం
- ఇప్పటికి వరకు నగం కూడా విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- మూడు రోజుల ముందు నిధుల కోసం అగచాట్లు
- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం



ఫుట్‌పాత్‌లకు రంగులు వేస్తున్న కార్మికులు

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కేవలం మూడు రోజులే మిగిలి ఉన్న వేళ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర-2025' కార్యక్రమానికి నిధుల లేమి వెంటాడుతోంది. కార్యక్రమ నిర్వహణకు మొత్తం రూ.75 కోట్లు అవసరమని జిల్లా యంత్రాంగం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపగా.. ఇప్పటివరకు కేవలం రూ.20 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. అదీ మంగళవారం విడుదలైన ఈ అరకొర నిధులు.. గంటల వ్యవధిలోనే బిల్లుల చెల్లింపులకు ఆవిరైపోవడంతో ఖజానా మళ్లీ ఖాళీ అయింది. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

వచ్చీ రాగానే ఖర్చు

విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించాలని నిర్ణయం మొదలు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ముఖ్యమంత్రి నుంచి అధికారుల వరకు గత నెల రోజులుగా సమీక్షలు చేస్తూ.. ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. ఈ కార్యక్రమ నిర్వహణకు మొత్తం రూ.75 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే మంగళవారం కేవలం రూ.20 కోట్లు మాత్రమే విడుదల చేసింది రాష్ట్ర ప్రభుత్వం. రూ.20 కోట్లు జిల్లా యంత్రాంగం ఖాతాలో పడిన నాలుగు గంటల్లోనే చెల్లింపులు జరిగాయి. అయితే, పేరుకుపోయిన బిల్లులతో పోలిస్తే ఇది నామమాత్రమే. చెల్లించాల్సిన ప్రతీ వంద రూపాయలకు కేవలం పది రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించి చేతులు దులుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. స్టేజీల నిర్మాణం, బారికేడ్లు, స్నాక్స్ ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లు వంటి అత్యవసర పనులకు సంబంధించిన కాంట్రాక్టర్లకు ఈ పాక్షిక చెల్లింపులు జరిపారు. మిగిలిన మొత్తం కోసం వారి నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుండటంతో, తక్షణమే మిగతా నిధులు విడుదల చేయాలని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి మరోసారి లేఖ రాసింది.

భారీ ఏర్పాట్లు.. అరకొర నిధులు

ఒకవైపు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నా, మరోవైపు కార్యక్రమ ఏర్పాట్లు మాత్రం సాగుతున్నాయి. సుమారు 5 లక్షల మంది పాల్గొంటారని అంచనా వేసి, బీచ్ రోడ్డులో తొక్కిసలాట జరగకుండా 326 ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు ప్రత్యేక వేదికలు సిద్ధమవుతున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం 2 లక్షల మ్యాట్లు, టీ-షర్టులు అందించగా, మరో 3 లక్షల మందికి అవసరమైన వాటిని రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చాల్సి ఉంది. దీనికి తోడు పాల్గొనే 5 లక్షల మందికి ఒక్కొక్కరికి రూ.100 విలువైన స్నాక్స్ ప్యాకెట్ అందించాలన్నా రూ.5 కోట్ల ఖర్చు తప్పదు. ఈ ఖర్చులన్నీ కాకుండా వీఐపీ, వీవీఐపీల బస, రవాణా వంటి అదనపు వ్యయాలు ఉన్నాయి. ఇప్పటికే జీవీఎంసీ, వీఎంఆర్డీఏ వంటి సంస్థలు తమ నిధులతో సుందరీకరణ, నిర్మాణ పనులు చేపడుతూ అదనపు భారం మోస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం అంచనా వ్యయంలో కనీసం సగం కూడా విడుదల చేయకపోవడంతో, ఇంత ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో తెలియక అధికారులు ఆపసోపాలు పడుతున్నారు.

హోటళ్లు, రిసార్ట్‌లు హౌస్‌ఫుల్

- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- అతిథుల కోసం భారీ ఏర్పాట్లు
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రుల హాజరు

మహారాణిపేట: నగరానికి వీవీఐపీలు, వీఐపీల తాకిడి పెరిగింది. మూడు రోజుల్లో విశాఖ కేంద్రంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నారు. దీంతో ఈ నెల 20, 21 తేదీల్లో విశాఖ వచ్చే అతిథుల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వీరికి రెండు రోజులకు అవసరమైన వసతి, రవాణా, ఇతర ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీగా ఉంది. కార్యక్రమంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, 22 మంది ఐఏఎస్‌లు, 70 మంది ఐపీఎస్ అధికారులు, కేంద్ర, రాష్ట్ర ఆయుష్ విభాగానికి చెందిన 40 మంది అధికారులతోపాటు, రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, సీనియర్ నాయకులు, టీడీపీ, జనసేన నేతలు భారీగా తరలివస్తున్నారు. వీరి కోసం నగరంలో హోటల్స్, రిసార్ట్స్ సిద్ధం చేశారు. దీంతో నగరంలో చిన్న, పెద్ద అన్ని హోటళ్లు హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టేశాయి.

అన్నీ రిజర్వ్‌డ్

నగరంలో హోటల్స్, రిసార్టుల్లో రూమ్‌లు అన్నీ రిజర్వ్ చేశారు. మొత్తం 15 హోటళ్లలో 520 గదులు, 18 సూట్స్, 53 ప్రీమియర్, 147 సుపీరియర్/లగ్జరీ సూట్స్ సిద్ధం చేశారు. నగరానికి చేరుకున్న వారికి వారి హోదాను బట్టి సూట్స్, రూమ్స్ కేటాయిస్తున్నారు. ప్రధాని మోదీకి నేవీలో బస ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు నోవోటెల్, డీసీఎం పవన్ పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో ఉంటారు.

ఒక్కో కారులో ఇద్దరేసి అధికారులు

వీవీఐపీలు, వీఐపీల కోసం నగరంలో 400కు పైగా కార్లు ఏర్పాటు చేశారు. పీఎం, సీఎం, ఇతర వీవీఐపీల కాన్వాయ్‌ల కోసం కార్లు సిద్ధంగా ఉంచారు. కార్లు అనుకున్న స్థాయిలో దొరక్కపోవడంతో ఇద్దరేసి అధికారులకు కలిపి ఒక కారు కేటాయిస్తున్నారు. ఇవి కాకుండా శాఖల వారీగా వాహనాల సేకరణ చేస్తున్నారు. జిల్లా అధికారుల ద్వారా కూడా వాహనాలను సేకరించి, సంబంధిత డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులకు అందిస్తున్నారు.

22 వేల మందితో బందోబస్తు

- 20వ తేదీ మధ్యాహ్నం నుంచి 21వ తేదీ సాయంత్రం వరకు ట్రాఫిక్ ఆంక్షలు
- పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



అల్లిపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి 9,500 సివిల్ పోలీసులు, 2 వేల మంది ఏఆర్ సిబ్బంది, బయట నుంచి 10 వేలకు పైగా పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బీచ్ రోడ్డులో 26 కి.మీ మేర ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు, ఏయూలో జరగనున్న యోగా డే వేడుకలకు 5 లక్షల మంది పాల్గొంటారన్నారు. ఇందులో భాగంగా 20వ తేదీ మధ్యాహ్నం నుంచి 21వ తేదీ సాయంత్రం వరకు విశాఖలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పార్క్ హోటల్ వరకు, పార్క్ హోటల్ నుంచి భీమిలి బీచ్ వరకు వాహన రాకపోకలపై ఆంక్షలు ఉంటాయన్నారు. విజయనగరం నుంచి వచ్చే బస్సులు బోయపాలెం వైపు, అల్లూరి జిల్లా నుంచి వచ్చే బస్సులు వేపగుంట వైపు నుంచి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. నగరంలో ట్రాఫిక్ పరిస్థితులపై ఇటీవల విడుదల చేసిన అస్త్రం యాప్ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఐఎన్ఎస్ చోళ, ఆంధ్ర యూనివర్సిటీ మైదానం, కాళీమాత ఆలయం, ఐఎన్ఎస్ కళింగ సమీపంలో 5 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్‌లు నిషేధించినట్లు వివరించారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలో జిల్లావాసులకు చోటు



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో వివిధ హోదాల్లో వలువురిని నియమించారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కేవీ బాబా(విశాఖ నార్త్), రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శిగా షేక్ రఫీ అహ్మద్(విశాఖ సౌత్), రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం సెక్రటరీలుగా పబ్బరాజు యోకో నారాయణ(గాజువాక), ఎటలపాక విజయ భాస్కర్ రావు(విశాఖ సౌత్), రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా మాసిక లక్ష్మి(విశాఖ నార్త్), రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా రాజబతల భానుమూర్తి(విశాఖ సౌత్), రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా గొందేసి సత్యనారాయణ(విశాఖ వెస్ట్)ను నియమించారు.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు



మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ బదిలీల్లో భాగంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌లో మొత్తం 43 మందిని బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్‌లు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ లోకనాథం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. 12 మంది ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 28 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కూడా స్థాన చలనం కలిగింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 330 మందిని బదిలీ చేశారు. ఈ మేరకు ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధాకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 250 మంది స్టాఫ్ నర్సులు, 80 మంది హెడ్ నర్సులు బదిలీ అయ్యారు. వైద్య ఆరోగ్యశాఖలో ఐదు కేడర్లలో 60 మంది స్థాన చలనం పొందారు.

పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్ల బదిలీ

మురళీనగర్: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు బదిలీలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జీవీ రామచంద్రరావు గన్నవరం పాలిటెక్నిక్ కాలేజీకి బదిలీపై వెళ్లగా, ఆ స్థానంలో సింహాద్రిపురం పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.తాతాజీని బదిలీపై నియమించారు. ప్రస్తుతం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అతని ఒరిజినల్ స్థానం ఆముదాలవలస నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి, ఆముదాలవలసకు శ్రీకాకుళం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకి రామయ్య బదిలీపై రానున్నారు. పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.సుజాత కాకినాడ ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కాలేజీకి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తాడిపత్రి నుంచి ఎం.హరిబాబు బదిలీపై రానున్నారు.

25న పెన్షన్ అదాలత్

మహారాణిపేట: ఈనెల 25న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు తపాల శాఖ సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలశాఖలో పనిచేసి రిటైరైన వారు సమస్యలుంటే ఈనెల 23వ తేదీలోగా వినతి పత్రాలు సీనియర్ సూపరింటెండెంట్, తపాల శాఖ, విశాఖపట్నం-01కు పంపాలని కోరారు.

విశాఖలో క్రికెట్ పండగ

విశాఖ స్పోర్ట్స్: విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం మహిళల వరల్డ్ కప్ క్రికెట్‌లో ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. భారత్ మహిళా క్రికెట్ జట్టు అక్టోబర్ 9వ తేదీన దక్షిణాఫ్రికా జట్టుతో, 12వ తేదీన ఆస్ట్రేలియా జట్టుతో తలపడనుంది. బంగ్లాదేశ్ మహిళా జట్టు అక్టోబర్ 10వ తేదీన న్యూజిలాండ్‌తో, 13న దక్షిణాఫ్రికాతో, 16న ఆస్ట్రేలియాతో ఆడనుంది. వుమెన్ వరల్డ్ కప్ ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి జరగనుంది.

ఒక వన్డే, ఒక టీ20 మ్యాచ్

భారత మెన్ క్రికెట్ జట్టు వచ్చే ఏడాది జనవరి 28వ తేదీన న్యూజిలాండ్‌తో నాల్గవ టీ20 మ్యాచ్ విశాఖ వేదికగానే ఆడనుంది. రాత్రి 7 గంటలకు వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్ ప్రారంభం కానుంది. దక్షిణాఫ్రికా జట్టు భారత్ పర్యటనలో భాగంగా సిరీస్‌లో మూడో వన్డే డిసెంబర్ 6వ తేదీన తేదీ ఆడనుంది. ఈ మ్యాచ్ డే నైట్‌గా మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభం కానుంది.

● రెక్కలు తొడిగి.. రెపరెపలాడి.!



జూలో జన్మించిన నెమలి పిల్లలు



అడవి కోళ్ల పిల్లలు

ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్.. కొత్త పక్షుల కిలకిలరావాలతో మరింత కళకళలాడుతోంది. జూలో వన్యప్రాణుల పునరుత్పత్తి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుండగా, తాజాగా ఐదు జాతులకు చెందిన 34 పక్షి పిల్లలు సందడి చేస్తున్నాయి. జూలోని వెటర్నరీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో ఇంక్యుబేటర్ల ద్వారా ఈ గుడ్లను పొదిగించి, కొత్త జీవాలకు ప్రాణం పోశారు. ఈ ప్రాణుల్లో 13 గడుసరి నెమలి పిల్లలు, 13 చలాకీ అడవి కోడి పిల్లలు(రెడ్ జంగిల్‌ఫౌల్) ఉన్నాయి. వీటితో పాటు రంగు రంగుల ప్రేమ పక్షులైన 4 పీచ్-ఫేస్డ్ లవ్ బర్డ్స్, 3 ముద్దులొలికే ల్యూటినో పారాకీట్స్(రామచిలుకలు), ఒక అందమైన నీలి- పసుపు మకా పిల్లను కూడా విజయవంతంగా పొదిగించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పక్షుల పిల్లలన్నీ సంపూర్ణ ఆరోగ్యంతో, చురుకుగా ఉన్నాయన్నారు. వెటర్నరీ బృందం అవిశ్రాంత కృషి, పర్యవేక్షణ వలనే ఇది సాధ్యమైందన్నారు. కొత్త పక్షుల రాకతో జూపార్క్‌కు సరికొత్త ఆకర్షణ తోడైంది. - ఆరిలోవ



ల్యూటినో పారాకీట్ పిల్లలు



కుండలో తల్లితో లవ్ బర్డ్ పిల్లలు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

యోగా దినోత్సవ సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు



కమాండ్ కంట్రోల్ కేంద్రంలో జరిగిన సమీక్షలో కృష్ణబాబు, చిత్రంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

మహారాణిపేట: అధికారులు సమన్వయంతో పనిచేసి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సూచించారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్లో మంగళవారం ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రంలో యోగాంధ్ర విధుల ప్రత్యేక అధికారులు, పోలీస్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బస్సుల ఏర్పాటు, ప్రజలు, విద్యార్థుల తరలింపు, పార్కింగ్, ట్రాఫిక్, పారిశుధ్యం తదితర ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమానికి విచ్చేసే ప్రజలు, విద్యార్థులను జాగ్రత్తగా తీసుకురావడం, ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా కేటాయించిన స్థలాలకు చేర్చి, తిరిగి క్షేమంగా వారిని గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పాడేరు, అనకాపల్లి జిల్లాల నుంచి వచ్చే ప్రజలను వారికి కేటాయించిన బ్లాకులకు నేరుగా తరలించాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో మైక్, లైటింగ్ ఏర్పాటు చేసి, రెవెన్యూ, పోలీస్, ఆర్టీసీ, రవాణా శాఖ సిబ్బందిని నియమించాలన్నారు. ప్రతి బస్సుపై సంబంధిత సచివాలయం వివరాలు తెలిసేలా బ్యానర్ తప్పనిసరన్నారు. యోగా నిర్వహించే ప్రదేశాలకు దగ్గర్లోని పబ్లిక్ టాయిలెట్స్, వివిధ హోటల్, రెస్టారెంట్స్ చెందిన టాయిలెట్స్‌ను ప్రజలు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. వాహనాల రాకపోకల పర్యవేక్షణ, వాహనాల మెయింటనెన్స్‌కు సంబంధించి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, టాయిలెట్స్, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కందిపప్పు.. ఎప్పుడో చెప్పు?

- రేషన్ డిపోల్లో పంపిణీ చేయని కూటమి ప్రభుత్వం
- నిరాశలో లబ్ధిదారులు



మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేరతాయని.. రేషన్ షాపుల్లో నిత్యావసరాలన్నీ అందుబాటులోకి వస్తాయని ఆశించిన పేద, మధ్యతరగతి ప్రజలకు నిరాశే మిగులుతోంది. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా.. ఈ జూన్‌లో కూడా రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీ కాలేదు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదార మినహా ఇతర సరకుల జాడలేదు. ఎన్నికలకు ముందు చంద్రబాబు కందిపప్పు, రాగిపిండి, వంటనూనె వంటివి అందిస్తామని హామీలు గుప్పించారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేశారని, కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెడుతున్నారని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి కార్డుదారుడికీ కిలో కందిపప్పును అందించేవారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. కానీ కూటమి సర్కార్ పాలనలో గత 12 నెలలుగా కందిపప్పు సరఫరా అడపాదడపాగా మారి.. ఇప్పుడు పూర్తిగా నిలిచిపోవడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జిల్లా పౌరసరఫరాల శాఖ పరిధిలో మధురవాడ, ఆనందపురం, భీమిలి, పెందుర్తి, గాజువాక వంటి ప్రాంతాల్లో 5,12,619 తెలుపు రేషన్ కార్డులు ఉన్నాయి. 625 చౌకధరల దుకాణాల ద్వారా వీరికి సరకుల పంపిణీ జరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, నిత్యావసరాలన్నీ పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని.. ముఖ్యంగా కందిపప్పును వచ్చే నెల నుంచైనా అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

డీఎస్సీ పరీక్షకు 2,305 మంది హాజరు

ఆరిలోవ: జిల్లాలో మంగళవారం 12 కేంద్రాల్లో జరిగిన డీఎస్సీ పరీక్షలకు 2,305 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 1,186 మందికి గాను 1,157 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 1,185 మందికి గాను 1,148 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. మొత్తంగా 66 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

మహా విలాపం











నిశ్శబ్దంగా ఒక మహా విలాపం.. అది మనుషులది కాదు.. చెట్లది. విశాఖలో అందమైన బీచ్‌రోడ్డు, నిన్నటి వరకు పచ్చని చెట్లతో కళకళలాడుతూ, స్వచ్ఛమైన గాలిని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే ఆ మార్గం నేడు బోసిపోయింది. 'యోగాంధ్ర' పేరుతో జీవీఎంసీ చేపట్టిన పనుల్లో భాగంగా సాగర్‌నగర్ నుంచి రుషికొండ వరకు రోడ్డుకి ఇరుపక్కలా ఉన్న చెట్లకు గొడ్డలిపోటు పడింది. సముద్రపు గాలిని ఆస్వాదిస్తూ, పచ్చని చెట్ల నీడలో సేదతీరడానికి వచ్చే స్థానికులు, పర్యాటకులు ఇప్పుడు నిరాశతో వెనుదిరుగుతున్నారు. సాయంత్రం వేళల్లో జాగింగ్‌కు, వాకింగ్‌కు వచ్చే వారికి కూడా ఇప్పుడు నీడ లేదు. 'యోగా అంటే ప్రకృతితో మమేకమవ్వడం. ప్రాణవాయువును అందించే వృక్షాలను నరికివేసి యోగా చేయడం ఎంత వరకు సమంజసం?' అని పలువురు ప్రశ్నిస్తున్నారు. 'యోగాతో ఆరోగ్యం వస్తుందనుకుంటే, చెట్లను నరకడం ద్వారా పర్యావరణాన్ని నాశనం చేసి, అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారని' వారు ఆవేదన చెందుతున్నారు. పచ్చదనం లేని చోట యోగా ఎలా సాధ్యం అని వారు నిలదీస్తున్నారు.

-ఆరిలోవ/ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అడ్మిషన్లలో వెనుకబడి

- వెలవెలబోతున్న అతిపెద్ద ప్రభుత్వ పాఠశాల
- 'కూటమి' నిర్లక్ష్యంతో పడిపోయిన ప్రవేశాలు
- ఇదీ చంద్రంపాలెం హైస్కూల్ దుస్థితి


అడ్మిషన్లపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు


వర్షం వస్తే నీటిలోనే పాఠశాల మైదానం

మధురవాడ: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్న చందంగా తయారైంది రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వ పాఠశాల పరిస్థితి. గత ప్రభుత్వాల హయాంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వేల అడ్మిషన్లతో కళకళలాడిన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.. నేడు విద్యార్థుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితికి చేరుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్యారంగంపై చూపుతున్న నిర్లక్ష్యానికి ప్రస్తుతం ఈ పాఠశాలలో పడిపోయిన అడ్మిషన్ల సంఖ్యే నిదర్శనం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే విద్యార్థుల సంఖ్య పరంగా అతిపెద్ద పాఠశాలగా రికార్డు సృష్టించిన ఈ స్కూల్‌లో ఏటా వేసవి సెలవుల్లోనే దాదాపు 30 శాతం అడ్మిషన్లు పూర్తయ్యేవి. గత విద్యా సంవత్సరాల్లో ప్రతి ఏటా సుమారు 1,000కి పైగా కొత్త అడ్మిషన్లు నమోదయ్యాయి. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభమై ఆరు రోజులు కాగా.. కేవలం 310 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఈ గణాంకాలను చూస్తేనే అర్థమవుతుంది అడ్మిషన్ల పరిస్థితి ఏ విధంగా ఉందోనని.

ప్రభుత్వ వైఫల్యాలే కారణమా?

గతంలో వేసవిలోనే ప్రత్యేక కార్యాచరణతో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టేవారు. ఈ ఏడాది ఉపాధ్యాయుల బదిలీలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన 'అమ్మ ఒడి' పథకం అడ్మిషన్ల పెరుగుదలకు దోహదపడింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది తల్లికి వందనం అమలు చేయలేదు. దీంతో తల్లిదండ్రులు నిరాశ చెందారు. ఈ ప్రభావం అడ్మిషన్లపై పడింది. ఈ ఏడాది పలు నిబంధనలు విధించి కొందరికే తల్లికి వందనం అమలు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

జెడ్పీ ఉన్నత పాఠశాల, చంద్రంపాలెం	
విద్యార్థుల సంఖ్య	3,239
ఉపాధ్యాయుల సంఖ్య	104
తరగతి గదులు	62
సెక్షన్‌లు	62

గత మూడేళ్లలో అడ్మిషన్లు ఇలా..	
2022-23	950
2023-24	1,100
2024-25	1,200
ఈ ఏడాది ఇప్పటివరకు	310

మంత్రి హామీ ఏమైంది?

ఆరు నెలల కిందట చంద్రంపాలెం పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.. మైదానంలో వర్షపు నీరు నిలిచిపోయే సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నేటికీ పరిస్థితిలో మార్పు లేదు. గత ప్రభుత్వం హయాంలో మొదలైన 10 అదనపు తరగతి గదుల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. అడ్మిషన్ల సంఖ్య అనుకున్న విధంగా జరగకపోవడంతో ఆలస్యంగా మేల్కొన్న పాఠశాల యాజమాన్యం.. అడ్మిషన్ల కోసం 7 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ ఉపాధ్యాయ బృందాలు ఇప్పుడు చుట్టుపక్కల కాలనీల్లో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను చేర్పించమని అవగాహన కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు ఎలా తిరోగమనంలో పయనిస్తున్నాయో చెప్పడానికి చంద్రంపాలెం పాఠశాల ప్రస్తుత పరిస్థితే ప్రత్యక్ష ఉదాహరణగా మారింది.

అడ్మిషన్ల కోసం ఏడు ప్రత్యేక బృందాలు



ప్రస్తుతం అడ్మిషన్ల సరళిని చూస్తే గతేడాది కంటే తగ్గే పరిస్థితి కనిపిస్తోంది. అందుకే విద్యార్థులను పాఠశాలలో చేర్పించడానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాం. ఏడు సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులతో ఏడు బృందాలు ఏర్పాటు చేశాం. మారికవలస ఆర్‌జీకే కాలనీ, సాయిరాం కాలనీ, శివశక్తినగర్ రోడ్డులోని పలు కాలనీలు, స్వతంత్రనగర్, సేవా నగర్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కొమ్మాది కాలనీలు, పీఎం పాలెం, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. టీసీలు లేకపోయినా 8వ తరగతి వరకు అడ్మిషన్లు ఇస్తున్నాం. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రైవేట్ స్కూళ్ల నుంచి టీసీలు త్వరగా ఇప్పించేలా చూస్తాం.

– ములుగు వెంకటరావు, ప్రధానోపాధ్యాయుడు

ఘనంగా గంగమ్మ మారువారం పండగ


గంగమ్మ తల్లి ఆలయం వద్ద మహిళలు

మహారాణిపేట: మత్స్య సంపద సమృద్ధిగా లభించాలని, వేటకు వెళ్లిన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని కోరుతూ మత్స్యకార మహిళలు మంగళవారం భక్తి శ్రద్ధలతో గంగమ్మ తల్లి మారువారం నిర్వహించారు. ఫిషింగ్ హార్బర్‌లోని గంగమ్మ తల్లి ఆలయం వద్ద కనులపండువగా ఈ కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'గంగమ్మ తల్లి.. కాపాడమ్మా' అంటూ వేడుకున్నారు. మత్స్యకార సంప్రదాయం ప్రకారం పూజలు చేసి, పసుపు, కుంకుమలను సముద్రంలో నిమజ్జనం చేశారు. గత మంగళవారం గంగమ్మ పండగ నిర్వహించిన అనంతరం ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి మత్స్యకారులు వేట ప్రారంభించారు. మారువారం సందర్భంగా సముద్ర దేవతను పసుపు, కుంకుమలతో డ్రై ఫిష్ మహిళా సంఘం సభ్యులు పూజించారు. మర పడవల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.సి.అప్పారావు, అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, ఎం.సోములమ్మ, డి.ఎర్రమ్మ, జె.పరదేశమ్మ, నూకలమ్మ తదితరులు పూజ, ఊరేగింపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి రైతు బలి

కరెంటు షాక్‌తో పాడి రైతు మృతి


అప్పారావు(ఫైల్)


విద్యుత్ వైరు తాకి మృతి చెందిన పాడిరైతు

మధురవాడ: విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి మంగళవారం ఓ పాడి రైతు బలైపోయాడు. మారికవలసకి చెందిన పాడిరైతు కొండ్రి అప్పారావు(75) కొమ్మాది ఓజోన్ వ్యాలిలో (బోరవానిపాలెం వైపు వెళ్లే రోడ్డులో) నేలపై పడి ఉన్న విద్యుత్ వైర్లను తాకి మృతి చెందాడు. అతడు మారికవలస గ్రామంలో కుటుంబంతో నివసిస్తూ ఆవులు, గేదెలు పోషణ చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. మంగళవారం పశువులను మేతకు తీసుకువచ్చాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడాడు. తర్వాత ఫోన్ పనిచేయలేదు. అనుమానం వచ్చి వెతకగా కరెంటు వైర్లు పట్టుకుని ఓజోన్ వ్యాలి రోడ్డులో పడి ఉన్నాడు. పీఎంపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.

విద్యుత్ శాఖలో వరుస ప్రమాదాలు

విద్యుత్ శాఖ జోన్-3 కార్యాలయం పరిధిలో తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నా భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ బ్రేక్ డౌన్ పనులు చేస్తూ కొద్ది నెలల క్రితం వెంకటేష్ అనే జేఎల్‌ఎం మృతి చెందారు. తర్వాత బక్కన్నపాలెంలో అనధికార లైన్‌మెన్ హెల్పర్ ఎం.వెంకటరమణ మృతి చెందారు. మారికవలస సిగ్నల్ వద్ద విద్యుత్ వైర్ తెగిపడి మరో వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెంలో మరో జేఎల్‌ఎం విద్యుత్ పనులు చేస్తూ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మధ్యకాలంలోనే గోపాలపట్నం ఏరియాలో మరో ఇద్దరు మృతి చెందారు.

ఆగ్నేసమ్మ ఇకలేరు

హీరో సందీప్ కిషన్ నాన్నమ్మ కన్నుమూత


శవపేటికను మోస్తున్న హీరో సందీప్ కిషన్, కుటుంబ సభ్యులు.చిత్రంలో ఛోటా కె.నాయుడు

కంచరపాలెం: జ్ఞానాపురం సిరిల్ వీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని శ్రీపాదం ఆగ్నేసమ్మ(88) సోమవారం అర్ధరాత్రి కన్నుమూశారు. మంగళవారం సెయింట్ పీటర్స్ కేథడ్రల్ చర్చి సెమెట్రీలో ఆమె భూస్థాపన నిర్వహించారు. విశాఖలోని పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయినిగా పనిచేసిన ఆగ్నేసమ్మ.. వృత్తిలో ఉన్న సమయంలో ఎంతోమంది పేద పిల్లలను చదివించి, వారి అవసరాలు తీర్చి అండగా నిలిచారు. ఆగ్నేసమ్మ పెద్ద కుమారుడు రవి తనయుడు, ప్రముఖ హీరో సందీప్ కిషన్ మద్రాసులో స్థిరపడినప్పటికీ, జ్ఞానాపురంలో తమ బంధువులతో సంబంధాలను కొనసాగిస్తున్నారు. తనకు ఎంతో ఇష్టమైన నాన్నమ్మ(ఆగ్నేసమ్మ) మరణవార్త విని చలించిపోయిన సందీప్ కిషన్..తన మేనమామ, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఛోటా కె.నాయుడు, కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఇక్కడకు చేరుకున్నారు. ఆగ్నేసమ్మ భూస్థాపన కార్యక్రమంలో పాల్గొని ఆమెకు నివాళులర్పించారు. సెయింట్ పీటర్స్ చర్చి పరిసరాల్లో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

అదృశ్యమై.. శవమై.!

- మిస్టరీగా మారిన వివాహిత మృతి
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


బంగారు కవిత (ఫైల్)

భీమునిపట్నం: భీమిలిలో నెల రోజుల క్రితం అదృశ్యమైన మహిళ మంగళవారం బీచ్‌రోడ్డులోని జీడి తోటలో శవమై కనిపించింది. కృష్ణాకాలనీకి చెందిన బంగారు కవిత (28) గత నెల 10న సరకులు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త పైడిరాజు ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కవిత అదృశ్యంపై ఆమె భర్త, కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైంది. కాగా.. బీచ్‌రోడ్డులోని మార్లిన్ కే రెస్టారెంట్ ఎదురుగా ఉన్న జీడి తోటలో ఒక చెట్టు కొమ్మకు వేలాడుతున్న మహిళ తల, వేరుపడిన శరీరం ఉండడాన్ని కొందరు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ తిరుమలరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

హత్య? ఆత్మహత్య?

కవిత మృతి విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది హత్యనా లేక ఆత్మహత్యనా అనేది తేలాల్సి ఉంది. అదృశ్యమైన ఒకటి, రెండు రోజుల్లోనే ఆమె చనిపోయి ఉండవచ్చని తెలుస్తోంది. మంగళవారం వరకు మృతదేహం ఎవరికీ తెలియకపోవడంతో తల నుంచి శరీరం నేల మీద పడిపోయి, బాగా పాడైపోయిన స్థితిలో ఉంది. దీంతో పోస్టుమార్టంను అక్కడే నిర్వహించారు. పోలీసుల దర్యాప్తులో ఆమెకు ఒక వ్యక్తితో పరిచయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంతో ఏదైనా గొడవలు జరిగి ఇక్కడకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడిందా, లేక ఎవరైనా హత్య చేసి ఉంటారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, తాము ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు సరైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అందువల్లే ఆమె చనిపోయిందని కుటుంబ సభ్యులు బీచ్‌రోడ్డులో నిరసన తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి


రమణ మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో ఎత్తు నుంచి జారిపడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. కార్మిక నాయకుల సమాచారం మేరకు వివరాలివి.. గాజువాక డిపో సమీప నక్కవానిపాలేనికి చెందిన కె.వి.రమణ (53) కోక్‌ఓవెన్స్ విభాగం సీడీసిపి-3లో స్కిల్డ్ కార్మికుడు పని చేస్తున్నాడు. మంగళవారం యథావిధిగా విధులకు హాజరైన రమణ ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి సుమారు 50 మీటర్లు ఎత్తులోకి వెళ్లాడు. అక్కడ నిల్చున్న షీటు విరిగిపోవడంతో కింద జారిపడ్డాడు. వెంటనే సహోద్యోగులు కోక్‌ఓవెన్స్ ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు ధృవీకరించారు. రమణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భద్రతా చర్యలు లేకపోవడం వల్లే..

సరైన భద్రతా చర్యలు లేకపోవడం వల్లే కాంట్రాక్ట్ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడని నాయకులు నమ్మి రమణ, సోంబాబు, నగేష్, ఉరుకూటి అప్పారావు, నాగరాజులు ఆరోపించారు. ప్రమాదం జరిగిన వెంటనే గాజువాకలో చికిత్స చేసి ఉంటే కార్మికుడు బతికే ఉండేవాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం పనిప్రదేశాల్లో భద్రతా చర్యలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు.

34 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో మంగళవారం చేపట్టిన తనిఖీల్లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు గంజాయి రవాణాను అడ్డుకుని.. ఆరుగురిని అరెస్ట్ చేశారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.ధనుంజయ నాయుడు పర్యవేక్షణలో ఎస్‌ఐ అబ్దుల్ మారుఫ్, దువ్వాడ ఆర్పీఎఫ్ ఎస్‌ఐ కె.టి.ఆర్.లక్ష్మి తమ సిబ్బందితో కలిసి వివిధ ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశాకు చెందిన బిజోయ్ కుమార్ జయసింగ్ విశాఖపట్నం మీదుగా తెలంగాణకు 3.2 కిలోల గంజాయిని రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. మరో కేసులో పాడువా నుంచి గంజాయిని మర్రిపాలెం రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చి ఒడిశాకు చెందిన నూతన్‌పాణికి అందజేస్తున్న రాజేంద్ర శెట్టి, అరుణ్ శెట్టిలను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 8.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇంకో ఘటనలో పాడేరు ప్రాంతానికి చెందిన గొల్లారి కార్తీక్, పాంగి రఘులు విశాఖపట్నం నుంచి విజయవాడకు గంజాయిని రవాణా చేస్తుండగా గుర్తించి, వారి వద్ద నుంచి 21.8 కిలోల గంజాయిని సీజ్ చేశారు. మొత్తంగా ఆరుగురు నిందితుల నుంచి దాదాపు 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- రిమాండ్‌కు 13 మంది
- 45 సెల్‌ఫోన్లు, 130 బ్యాంక్ పుస్తకాలు 33 ఏటీఎం కార్డులు, 4 ల్యాప్‌టాప్‌లు, 2 కౌంటింగ్ మెషీన్ల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డులు, కౌంటింగ్ మెషీన్లు

అల్లిపురం: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న 13 మందిని నగర సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటన విడుదల చేశారు. యువతకు మాయమాటలు చెప్పి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి వారి జీవితాలను నాశనం చేస్తున్న ఈ ముఠాపై సైబర్ క్రైం పోలీసులు దృష్టి సారించారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారికి మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సరఫరా చేస్తున్న కళింకోటకు చెందిన ఒక వ్యక్తిని ఇది వరకే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి సేకరించిన సమాచారం మేరకు దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైం పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి.. ఆధునిక సాంకేతిక సహాయంతో బెంగళూరులో బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తెలుసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బెంగళూరులోని బిలేకహళ్లిలో ఉన్న ఒక డెన్‌ను గుర్తించి దానిపై దాడి చేశారు. అక్కడున్న 13 మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 45 సెల్‌ఫోన్లు, 130 బ్యాంక్ పుస్తకాలు, 4 ల్యాప్‌టాప్‌లు, 33 ఏటీఎం కార్డులు, 2 కౌంటింగ్ మెషీన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఏఎంసీకి లక్ష్మీకాంతమ్మ పార్థివదేహం


మెడికల్ కాలేజీకి లక్ష్మీకాంతమ్మ పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న బంధువులు

మహారాణిపేట: సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ, అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక సభ్యురాలు పేరిచర్ల లక్ష్మీకాంతమ్మ పార్థివదేహాన్ని మంగళవారం ఆంధ్రా మెడికల్ కాలేజీకి దానం చేశారు. దేహదాన మహోద్యమానికి పునాది వేస్తూ, మొత్తం శరీరాన్ని దానం చేసిన తొలి 35 మందిలో పేరిచర్ల లక్ష్మీకాంతమ్మ ఒకరు. ఈమె ట్రస్ట్ వ్యవస్థాపక కోశాధికారి శ్రీహరి రాజు మాతృమూర్తి, ప్రముఖ సంఘ సంస్కర్త, దివంగత పేరిచర్ల సుబ్బరాజు జీవిత భాగస్వామి. లక్ష్మీకాంతమ్మ తెలుగు పండిట్‌గా పనిచేశారు. ఈ నెల 16న విజయవాడలో వైద్య పరీక్షలు చేయిస్తుండగా, ఆకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో కన్నుమూశారు. మంగళవారం లక్ష్మీకాంతమ్మ కళ్లను ఎల్.వి.ప్రసాద్ ఐ ఆసుపత్రికి దానం చేయగా, మధ్యాహ్నం 12 గంటలకు ఆమె పార్థివదేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అప్పగించారు. కార్యక్రమంలో ఆమె కుమారులు, బంధుమిత్రులు, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యులు జి.కన్యాకుమారి, అనిశెట్టి రజిత, జి.సురేఖ, కె.వి.ప్రసాద్, పి.కరుణ, కె. కళావతి, వై.యామిని తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీకాంతమ్మ లేని లోటు తమకు తీరనిదని ట్రస్ట్ వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు.

ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ శాఖ ప్రారంభం

డాబాగార్డెన్స్: దేశంలోని ప్రముఖ ట్రావెల్స్ సంస్థల్లో ఒకటైన ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ తమ సేవలను మరింత విస్తరించింది. ఇందులో భాగంగా డాబాగార్డెన్స్‌లో సంస్థ చైర్మన్ ఆర్‌వీ రమణ నూతన శాఖను ప్రారంభించారు. ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, తిరుపతి, కరీంనగర్, ఖమ్మం, కర్నూలు, వరంగల్, ఒంగోలు, రాజమండ్రి, భీమవరం, వారణాసి తదితర ప్రాంతాల ప్రజలకు ఈ సంస్థ సేవలు అందిస్తోంది. ఇప్పుడు విశాఖ జిల్లా ప్రజలకు మరింత చేరువయ్యేలా ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చైర్మన్ రమణ తెలిపారు. నూతన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కాశీ, అయోధ్య, మానస సరోవర్ వంటి దేశీయ యాత్రలపై 10 శాతం రాయితీని, యూరప్, లండన్, దుబాయ్, సింగపూర్, మలేసియా, బాలి, బ్యాంకాక్ వంటి విదేశీ యాత్రలపై 5 శాతం రాయితీని అందిస్తున్నట్లు ప్రకటించారు. కాశీ-అయోధ్య రూ.19,999, అమర్‌నాథ్ యాత్ర రూ. 67,500, కైలాస మానస సరోవర్ రూ. 2,75,000, లండన్ విత్ యూరప్ రూ.3,99,999, బ్యాంకాక్-పట్టాయ రూ. 39,999, దుబాయ్ రూ.85,000, సింగపూర్-మలేసియా రూ. 1,06,000, బాలి రూ.95,000లకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ నెల 20 వరకు దేశీయ యాత్రలపై డిస్కౌంట్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

'కేర్' డాక్టర్ రవికి అంతర్జాతీయ గౌరవం


ఆసియా పసిఫిక్ నీ ఆర్థ్రోప్లాస్టీ సదస్సులో మాట్లాడుతున్న రవి

ఆరిలోవ: విశాఖ కేర్ ఆస్పత్రికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ వట్టిపల్లి రవికి అరుదైన గౌరవం లభించింది. ఇటీవల థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా పసిఫిక్ నీ ఆర్థ్రోప్లాస్టీ సదస్సులో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఆయనకు దక్కింది. కేర్ ఆస్పత్రి సీవోవో తెలిపిన వివరాల ప్రకారం, ఈ సదస్సుకు భారత్ నుంచి ఎంపికైన ఐదుగురు వైద్యులలో డాక్టర్ రవి ఒకరు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో మొదటి రోజు ఆయన మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల గురించి వివరించారు. రెండో రోజు జరిగిన 'వైండ్ క్లోజర్ టెక్నిక్స్'పై జరిగిన ప్రత్యేక ప్యానెల్ చర్చలోనూ డాక్టర్ రవి చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ కేర్ యూనిట్ వైద్యులు డాక్టర్ రవిని అభినందించారు.

చికెన్ ధరలు	
చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.77
బ్రాయిలర్ (లైవ్)	: రూ.97
స్కిన్	: రూ.164
స్కిన్‌లెస్	: రూ.174

కోడిగుడ్ల ధరలు	రూ.లలో (వందకు)
విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00

రౌడీషీటర్ హల్‌చల్

- మద్యం మత్తులో యువకునిపై దాడి
- బీర్ సీసాతో తలపై కొట్టిన వైనం


పోలీసుల అదుపులో రౌడీషీటర్ అనిల్


గాయపడిన బీస్ బహుదూర్ తాత

పెదగంట్యాడ: మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం రాత్రి ఓ రౌడీషీటర్ హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో ఓ యువకునిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. సకాలంలో స్పందించిన పోలీసులు నిందితులను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. నగరంలోని అల్లిపురానికి చెందిన రౌడీషీటర్ వడ్డాది అనిల్ కుమార్ (25), అతని స్నేహితుడు గాజువాక మండలం జోగవానిపాలేనికి చెందిన ఒడిసిల శ్రీనివాస్ (32) సోమవారం రాత్రి పెదగంట్యాడ మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల ఓ వైన్‌షాపు సమీపంలో ఆటోలో కూర్చుని మద్యం సేవిస్తున్నారు. ఆ సమయంలో బర్మా కాలనీకి చెందిన మనోజ్ సింగ్ అతని అల్లుడు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బీసు బహుదూర్ తాతలో కలిసి అటుగా వెళ్తున్నారు. ఆటోలో మద్యం సేవిస్తున్న రౌడీషీటర్ అతని స్నేహితుడు అటుగా వెళ్తున్న వారితో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో రౌడీషీటర్ అతని చేతిలో ఉన్న బీర్ బాటిల్‌తో బీసు బహుదార్ తాత తలపై బలంగా కొట్టాడు. వెంటనే మనోజ్ సింగ్ అక్కడి నుంచి పరిగెత్తి తాత కుటుంబ సభ్యులను తీసుకువచ్చాడు. దీంతో వారిపై రౌడీషీటర్ కత్తితో దాడికి దిగాడు. వెంటనే అతన్ని వారంతా పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీవ్రంగా గాయపడిన తాతను అంబులెన్సులో కేజీహెచ్‌కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న న్యూపోర్టు పోలీసులు రౌడీషీటర్ అనిల్‌కుమార్, అతని స్నేహితుడు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మనోజ్ సింగ్ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్యామ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుకు భరోసా దక్కేనా..



- ఏడాది దాటినా అమలు కాని పథకం
- ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న 17,790 మంది రైతులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా

మహారాణిపేట: ఒకవైపు వర్షాల రాకతో రైతుల్లో ఆనందం.. ఇంకోవైపు పొలాలు దున్ని సాగుకు సిద్ధమవుతున్నా.. చేతిలో చిల్లిగవ్వలేని వైనం. గత ఏడాది ఎలాంటి సహాయం లేక అల్లాడిన రైతులు ఈ ఏడాది కూడా దిగాలుగానే ఉన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా రైతులకు రైతు భరోసా అందించేది. కూటమి ప్రభుత్వం రాకతో ఇప్పటికే ఓ ఏడాది ఎగవేశారు. ఈసారైనా అందిస్తారో.. లేదోనన్న ఆవేదనలో రైతులున్నారు.

జగన్ ప్రభుత్వంలో ఏటా ఆర్థిక సాయం

రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పథకాన్ని తొలి ఏడాది కూటమి సర్కార్ అటకెక్కించింది. రెండో ఏడాదీ ఖరీఫ్ సాగుకు రైతన్న సిద్ధమయ్యాడు. కూటమి సర్కార్ ప్రవేశ పెట్టిన అన్నదాత సుఖీభవ పథకం ఇంకా బాలారిష్టాలను దాటలేదు. అప్పుల ఊబిలో అన్నదాతలు కూరుకుపోకుండా ఆర్థికంగా ఆదుకోవాలన్న ఆశయంతో గత సీఎం వైఎస్ జగన్ రైతు భరోసా పథకాన్ని ప్రవేశ పెట్టి ఏటా కేంద్ర సాయం రూ.6 వేలుకు అదనంగా రూ.7,500 చెల్లించేది. గత ఎన్నికల్లో రూ.20 వేలు అందిస్తామని రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొలి ఏడాది మొండి చెయ్యి చూపింది. ఈ సంవత్సరంలో ఇంకా పథకం అమలుపై స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారులపై ని'బంధనాలు'

ఈ ఏడాది జిల్లాలో 17,790 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా ఉన్నారు. కూటమి సర్కార్‌లో వెబ్‌ల్యాండ్‌లో నమోదైన రైతులను మాత్రమే గుర్తిస్తున్నారు. ఈకేవైసీ తప్పనిసరి చేశారు. ఆన్‌లైన్ రికార్డుల ఆధారంగా యాజమాన్య రికార్డులు తనిఖీల్లో కొందరిని అనర్హులుగా తేలుస్తున్నట్టు తెలిసింది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోని చాలా మంది రైతులు పెట్టుబడి సాయానికి దూరం కానున్నారు. కూటమి హామీ మేరకు రూ.20 వేలు చొప్పున రైతు ఖాతాలో జమ చేయకుండా, లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.